సాక్షి
ములుగు

మంగళవారం । 4 । జూలై । 2023



ఆన్‌లైన్ చెల్లింపును ప్రోత్సహించాలి

ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపును ప్రోత్సహించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు సూచించారు. - 8లో▸



జాతర ఏర్పాట్లకు ముందస్తు కార్యాచరణ - 8లో▸

2024 ఫిబ్రవరిలో జరుగనున్న మేడారం జాతర విజయవంతానికి ముందస్తు కార్యాచరణ చేపడుతున్నామని మంత్రి సత్యవతి తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0^0 /24.0^0

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరుజల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

'దేవాదుల' పంపింగ్ షురూ..



కన్నాయిగూడెం: మండల పరిధిలోని తుపాకులగూడెం వద్దగల దేవాదుల ప్రాజెక్టు నుంచి పంపింగ్‌ను సోమవారం ప్రారంభించారు. గత కొన్నిరోజుల నుంచి పంపింగ్‌ను పూర్తిగా నిలిపివేసి కాల్వలోని సిల్ట్‌ను తొలగించిన అధికారులు సోమవారం 3వ ఫేజ్‌లో ఒక మోటారును ఆన్ చేశారు. ఆ నీటిని గొల్లబుద్దారం రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సమ్మక్క సాగర్ బ్యారేజీలోని 59 గేట్లను మూసి నీటిని నిల్వ చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి బ్యారేజీలోకి 3,175 క్యూసెక్‌ల నీరు వచ్చి చేరుతుండగా 292క్యూసెక్‌ల నీటిని అధికారులు కిందకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

ములుగు రూరల్: బాసర ట్రిపుల్ ఐటీకి బండారుపల్లి మోడల్ పాఠశాల విద్యార్థులు పదిమంది ఎన్నికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ శోభారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ జీపీఏ సాధించిన పాఠశాల విద్యార్థులు మామిడిశెట్టి రమ్యశ్రీ, వందన, నక్షత్ర సాహిని, నీరజ, ప్రణీత, రాజ, రుష్మిక, సారా ఆఫీనా, పల్లె స్వీతాకారెడ్డిలు సీట్లు సాధించారని వివరించి విద్యార్థులను అభిందనందించారు.

అకడమిక్ క్యాలెండర్ ఆవిష్కరణ



ములుగు రూరల్: విద్యాశాఖ తరఫున 2023–24 అకడమిక్ క్యాలెడర్‌ను సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని ఆవిష్కరించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్యాలెండర్లను సీఆర్పీల ద్వారా ప్రతీ పాఠశాలకు అందిస్తామన్నారు. 10వ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ విజయమ్మ, డీఈఓ కార్యాలయ కోఆర్డినేటర్లు రాజు, సాంబయ్య, రమాదేవి, విక్రమ్ రనాజ్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

ఏటూరునాగారం: ఏజెన్సీలోని రైతులు, ప్రజలు, యువకులు, మహిళలు వర్షాకాలంలో విద్యుత్ వినియోగంలో చాలా జాగ్రత్తలు పాటించాలని ఏటూరునాగారం ట్రాన్స్‌కో ఏఈ అశోక్, సబ్ ఇంజనీర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్పీడీసీఎల్ సీఎండి గోపాల్ రావు ఆదేశాల మేరకు విద్యుత్ వినియోగదారులందరికీ విద్యుత్ ప్రమాదాల నివారణ సూచనలు వివరించారు. తడి చేతులతో విద్యుత్ పరికరాలను, తీగలను ముట్టుకోవద్దని సూచించారు. ముఖ్యంగా బట్టలు ఆరేసే దండేలకు విద్యుత్ వైర్లు తాకకుండా చూసుకోవాలని కోరారు. విద్యుత్ ప్రవహిస్తున్న వైర్లకు ఎలాంటి జాయింట్‌లు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఆరుబయట విద్యుత్ స్తంభాలను తాకొద్దని, రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరికి వెళ్లొద్దని కోరారు. స్టార్టర్ డబ్బాలను నీటిలో తడవకుండా పైకి ఉండేలా జాగ్రత్త తీసుకోవాలని వివరించారు. వోల్టేజీ హెచ్చు తగ్గులు ఉంటే, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తున్నా వెంటనే విద్యుత్ శాఖ వారికి సమాచారం ఇవ్వాలని కోరారు. ఎవరికైనా పొరపాటున కరెంట్ షాక్ సంభవిస్తే దగ్గరలోని వ్యక్తులు షాక్ గురైన వ్యక్తిని ముట్టుకోకుండా కర్రతో కొట్టి కాపాడాలని సూచించారు. వర్షం కురుస్తున్నప్పుడు, కురిసినప్పుడు తడిసిన విద్యుత్ స్తంభాల స్టే, సపోర్టు వైరును, తడిచిన విద్యుత్ ఉపకరణాలను తాకొద్దని హెచ్చరించారు. సమస్య ఉంటే టోల్ ఫ్రీ నంబర్లలో 18004250028, 1912, 8374025075, 9908614791 సమాచారం ఇవ్వాలని కోరారు.

7న జాబ్‌మేళా

భూపాలపల్లి అర్బన్: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 7వ తేదీన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి శ్యామల సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని శ్రీరామ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో పనిచేసేందుకు బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌ల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ, బీటెక్ పూర్తిచేసిన 23 సంవత్సరాల నుంచి 33 సంవత్సరాలలోపు నిరుద్యోగులు హాజరుకావచ్చని సూచించారు. వివరాలకు 98487 11676, 77024 57968 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

హరితహారానికి బ్రేక్!

జిల్లాలో ప్రారంభం కాని కార్యక్రమం

- వర్షాలు లేక ముందుకు సాగని వైనం
- నర్సరీల్లోనే పెరుగుతున్న మొక్కలు
- ఈ ఏడాది లక్ష్యం 13.50 లక్షలు



నల్లగుంట నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

వెంకటాపురం(ఎం): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమం వర్షాలు లేక ఈ ఏడాది ఆలస్యమవుతుంది. 8వ విడత హరితహారం కోసం రెండు నెలలుగా అధికార యంత్రాంగం ప్రణాళికలు రూపొందించి సిద్ధంగా ఉన్నప్పటికీ వర్షభావ పరిస్థితుల కారణంగా ముందుకు సాగడం లేదు. జూన్ మొదటి వారంలోనే వర్షాలు కురిస్తే హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించాల్సి ఉండగా జూలై మొదటివారం వచ్చినప్పటికీ వరుణుడు కరుణించకపోవడంతో హరితహారం కార్యక్రమానికి ఆటంకం కలుగుతుంది.

13.50 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా 13.50లక్షల మొక్కలను నాటేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. అటవీశాఖ ఆధ్వర్యంలో 7.50 లక్షల మొక్కలు, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో 4.90 లక్షలు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 30వేలు, హార్టికల్చర్ ఆధ్వర్యంలో 50వేలు, పోలీస్‌శాఖ, ఎక్సైజ్, బీసీ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌ల పరిధిలో ఒక్కోశాఖ తరఫున 10వేల మొక్కలు నాటేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రతీ గ్రామంలో ఖాళీస్థలాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, సబ్‌సెంటర్లు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో వర్షాలు పడగానే మొక్కలు నాటేందుకు గుంతలను తీస్తున్నారు.

నర్సరీల్లోనే మొక్కలు

గ్రామీణాభివృద్ధిశాఖ, అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. ఒక్కో గ్రామానికి చెందిన నర్సరీలో 5వేల నుంచి 10వేల మొక్కలను పెంచుతున్నారు. గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 174 గ్రామ పంచాయతీల పరిధిలో 10.44 లక్షల మొక్కలను పెంచుతున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 55 నర్సరీలు ఏర్పాటు చేసి లక్షా 91 వేల మొక్కలను పెంచుతున్నారు. నర్సరీల్లో గుల్‌మోర్, రేన్ ట్రీ, రావి, మర్రి, కానుగ, వెదురుతో పాటు గార్డెనింగ్ మొక్కలైన దానిమ్మ, నిమ్మ, గోరింటాకు, జామ, మందారతో పాటు వివిధ రకాల పూల మొక్కలను పెంచుతున్నారు. వర్షాలు పడగానే మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయా శాఖలకు చెందిన అధికారులు పేర్కొంటున్నారు.



నల్లగుంట జీపీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటేందుకు గుంతలను తీస్తున్న కూలీలు

మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాం..



హరితహారం కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాం. వర్షాలు లేకపోయినప్పటికీ మొక్కలు నాటేందుకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 50 వేల గుంతలను తీసిపెట్టాం. డీఆర్‌డీఓ, అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు రెడీగా ఉన్నాయి. 8వ విడత హరితహారం లక్ష్యాన్ని అన్ని శాఖలకు చెందిన అధికారుల సహకారంతో పూర్తి చేస్తాం.

- వెంకటనారాయణ, డీఆర్‌డీఓ ఏపీడీ

పూజలు చేస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్ జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి



ఘనంగా గురుపౌర్ణమి

ములుగు: ములుగు మండలంలోని ప్రేమ్‌నగర్ సమీపంలో గల సాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఆలయ వ్యవస్థాపకులు ఆకుల రజిని ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని మేడారంలో గిరిజనులకు పోడు భూములకు పట్టాల పంపిణీకి వచ్చిన మంత్రి సత్యవతి రాథోడ్, జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి వెంట రెడ్కో చైర్మన్ యేరువ సతీష్‌రెడ్డి, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్, జెడ్పీటీసీ సభ్యురాలు సకినాల భవాని, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోరిక విజయరాంనాయక్, ములుగు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, ఆత్మ చైర్మన్ చందా చక్రపాణి, జాకారం సర్పంచ్ దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలను క్షుణ్ణంగా పరిశీలించాలి

కలెక్టర్ కృష్ణ ఆదిత్య



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

ములుగు: ఎన్నికలకు వినియోగించనున్న ఈవీఎం బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్లోని ఈవీఎం గోదాంను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంల మొదటి స్థాయి గోదాంను పరిశీలించారు. ఈవీఎం బ్యాలెట్ యూనిట్(బీయూ), కంట్రోల్ యూనిట్(సీయూ), వీవీ ప్యాట్ యంత్రాలను తనిఖీ చేశారు. ఈవీఎంలను భద్రపరిచే గదికి నిబంధనల మేరకు భద్రత కల్పించాలని అధికారులకు సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ గణేష్, ఎన్నికల విభాగం డీటీలు అనీస్, ఫాతిమాబేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గణేష్

ములుగు: ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ప్రజలు అందించిన దరఖాస్తులను సేకరించారు. జిల్లా వ్యాప్తంగా 64 దరఖాస్తులు రాగా అందులో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని 30, డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని ఆరుగురు, పెన్షన్లు మంజూరు చేయాలని నలుగురు, ఇతర సమస్యలపై 24 మంది వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గతంలో అందించిన దరఖాస్తులు తిరిగి పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సంబంధిత అధికారులు త్వరితగతిన స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గౌస్ హైదర్, రవాణాశాఖ అధికారి శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజ్‌కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, ల్యాండ్ సర్వే అధికారి రాజనర్సయ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

వెంకటాపురం(ఎం): గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి మండలాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ అధ్యక్షత వహించగా భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. కార్యకర్తలు పార్టీ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌పార్టీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు అవినీతికి కేరాఫ్ అడ్రస్ అని విమర్శించారు. ఈ నెల 8న పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వరంగల్‌కు వస్తున్న ప్రధాని నరేంద్రమోడీకి స్వాగతం పలికేందుకు ప్రజలు, బీజేపీ శ్రేణులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అల్లె శోభన్, దొంతిరెడ్డి రాకేష్‌రెడ్డి, కొత్త సురేందర్, కన్నబోయిన వీరేందర్, ససుగోజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన కేసీఆర్

- మంత్రి సత్యవతి రాథోడ్
- మేడారంలో గిరిజన లబ్ధిదారులకు పోడు పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్, జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, కలెక్టర్ కృష్ణ ఆదిత్య

ఎస్ఎస్ తాడ్వాయి: పోడు భూములకు పట్టాలిచ్చి గిరిజనుల జీవితాల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపారని రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మండల పరిధిలోని మేడారంలోని ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో కలెక్టర్ కృష్ణ ఆదిత్య అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన పోడు పట్టాలు, నిషేధిత సంస్థల్లో పనిచేస్తూ లొంగిపోయిన కుటుంబాలకు ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి సత్యవతిరాథోడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సేవాలాల్, కొమురం భీమ్ చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి సత్యవతి మాట్లాడారు. పోడు హక్కుల చట్టం ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు గత ప్రభుత్వాలు 3 లక్షల ఎకరాలకు పట్టాల పంపిణీ చేస్తే సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పరిపాలనలో ఒకే రోజు 4.60లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు అందించారని తెలిపారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం హక్కు పత్రాలను అందిస్తూ రైతుబంధు, రైతు బీమా పథకాలను వర్తింపజేసే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఇందుకుగాను ప్రభుత్వం రూ.406 కోట్లను వెచ్చించనున్నది వివరించారు. గత ప్రభుత్వాలు చేసిన చట్టాలతోనే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. గతంలో ప్రజల సంక్షేమానికి పాటుపడని కాంగ్రెస్ నేతలు ఇప్పుడు అధికారంలోకి వస్తే రూ.4వేల పెన్షన్ ఇస్తామని రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని తెలిపారు. మొదటగా కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రంలో అమలు చేసి చూపాలన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి మాట్లాడుతూ వేలాది మంది గిరిజన లబ్ధిదారులకు పోడు పట్టాలు అందించిన సీఎం కేసీఆర్‌ను ప్రజలు రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలన్నారు. పోడు భూములకు పట్టాలు ఇస్తామని మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు ఖమ్మంలో పోడు భూములకు హక్కులు కల్పించాలని ధర్నాలు చేస్తే దాడులు చేసిన విషయాన్ని మరిచిపోయి మాట్లాడుతున్నారన్నారు. జిల్లాలో 17వేల మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయడం గొప్ప సంకల్పమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముందుగా ఇటీవల మృతిచెందిన జెడ్పీ చైర్మన్ జగదీశ్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో రెడ్కో చైర్మన్ సతీష్ రెడ్డి, అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీఓ అంకిత్, ఓఎస్డీ అశోక్ కుమార్, గ్రంథాలయ చైర్మన్ గోవింద్ నాయక్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, ఎంపీపీ వాణిశ్రీ, సర్పంచ్ చిడం బాబురావు, కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఆర్డీఓ రమాదేవి, సీఈఓ ప్రసూనాం రాణి, డీపీఓ వెంకయ్య, డిప్యూటీ డైరెక్టర్ పోచం, డీఎంహెచ్ఓ అప్పయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

ఎన్నో ఏళ్ల కల సాకారం..



రాష్ట్ర ప్రభుత్వం పోడుదారులకు పట్టాలు పంపిణీ చేయడంతో ఎన్నో ఏళ్ల కల సాకారమైంది. ఆదివాసీ పోరాటలను, ఇబ్బందులను గుర్తించి సీఎం కేసీఆర్ పోడు పట్టాలు పంపిణీ చేయడం ఎంతో అనందంగా ఉంది. పోడు భూములకు హక్కులు కల్పించడంతో లబ్ధిదారులకు భరోసానిచ్చింది.

- మైపతి అరుణ్‌కుమార్, తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

సీఎం చొరవతోనే..



సీఎం కేసీఆర్ చొరవతోనే ఆదివాసీలకు పోడు పట్టాలు అందాయి. పోడు పట్టాలకు ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూసిన పోడుదారుల కల నెరవేరింది. సాగు భూమిపై ప్రభుత్వం హక్కు కల్పిస్తూ ప్రభుత్వం పాస్ పుస్తకాలు ఇవ్వడం లబ్ధిదారుల్లో ఆనందం కలిగించింది.

- పులుసం పురుషోత్తం, ఏటూరునాగారం జీసీసీ డైరెక్టర్

సంతోషంగా ఉంది..



అనేక సంవత్సరాలుగా ఎకరం పోడు భూమి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాము. హక్కు ప్రతాల కోసం అధికారుల చుట్టూ తిరిగాం. పోరాటలు కూడా చేశాం. ఎట్టకేలకు హక్కు పత్రాలు రావడం సంతోషంగా ఉంది.

- కుర్సం రవికుమార్, మేడారం

24మందికే పట్టాలు వచ్చాయి..



కామారం గ్రామపంచాయతీ పరిధిలో 24 మంది లబ్ధిదారులకు మాత్రమే పోడు పట్టాలు వచ్చాయి. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు కల్పించాలని చేసుకున్నా దరఖాస్తులను తిరస్కరించారు.

- కోర్నెబెల్లి వీరేశం, కామారం, పోడుదారుడు



భద్రకాళీ.. శరణం మమ

- వివరాలు 8లో▸

మహాశాకంబరిదేవిగా దర్శనం..

చారిత్రాత్మక శ్రీభద్రకాళి దేవాలయంలో తిథిమండల దేవాతాయజన పూర్వక శాకంబరి నవరాత్రోత్సవాల చివరిరోజు సోమవారం ఉదయం అమ్మవారిని మహాశాకంబరిదేవిగా అలంకరించారు. అలంకరణలో నాలుగు టన్నుల కూరగాయలు, పండ్లు, దుంపలను వినియోగించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. గత నెల 19వ తేదీ ఆషాఢ శుద్ధ పాడ్యమి సోమవారం ఉత్సవాలు ప్రారంభమై పక్షం రోజులుగా ఒక్కో క్రమంలో పూజలందుకుంటూ ఆషాఢ శుద్ధ పౌర్ణమి సోమవారం అమ్మవారు పరిపూర్ణ శాకంబరిదేవిగా భక్తులను అనుగ్రహించింది.

విద్యార్థులకు సికిల్ సెల్ పరీక్షలు



టెస్టు చేస్తున్న ఏఎన్ఎం తిరుమల

ములుగు: మండల పరిధిలోని జాకారం మినీగురుకులం, జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, మల్లంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం 198 మంది విద్యార్థులకు డాక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో సికిల్ సెల్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ విద్యార్థికి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పాజిటివ్‌గా తేలితే రెండో సారి శాంపిల్ సేకరించి జిల్లా కేంద్రంలోని టీ–హబ్‌కు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ దేవేందర్, దేవమ్మ, హెల్త్ అసిస్టెంట్ భూక్య వెంకన్న, రాజయ్య, ఏఎన్ఎంలు భూక్య తిరుమల, సుజాత, శిరీషా, సావిత్రి, ఆశ కార్యకర్తలు రజిత, నషీమా, మినీ గురుకులం ఉపాధ్యాయులు వాంకుడోత్ నిర్మల, రజిని, లత, పూల్‌బాయి, మణమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎర్రబెల్లికి కేసీఆర్ ఆశీస్సులు..



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల: పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన జన్మదినాన్ని (మంగళవారం) పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్.. మంత్రి ఎర్రబెల్లికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందించారు. అలాగే కేబినేట్ సమావేశం అనంతరం బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ కూడా మంత్రి ఎర్రబెల్లి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఏటా తన జన్మదిన వేడుకలను విదేశాల్లో జరుపుకుంటున్న మంత్రి దయాకర్‌రావు.. సోమవారం రాత్రి అమెరికా బయలుదేరారు.

బీసీలు ఎదగకుండా కుట్ర..



మాట్లాడుతున్న కూరపాటి వెంకటనారాయణ

నయీంనగర్: బీసీలు రాజకీయంగా ఎదగకుండా కుట్రలు జరుగుతున్నాయని తెలంగాణ బీసీ సంఘాల ఉద్యమకారులు అన్నారు. ఈ మేరకు సోమవారం హన్మకొండ హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇందూర్ జిల్లాలో కొందరు బీఆర్‌ఎస్ నాయకులు.. బీసీ కులాలను కించపరిచేలా వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ముదిరాజ్ కుటుంబాలను సామాజిక బహిష్కరణ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బీసీలు రాజకీయంగా ఎదగకుండా ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి వంటి వారిని ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి రావుల జగదీశ్వర్ ప్రసాద్, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకుడు చందా మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పాశికంటి రాజేంద్రప్రసాద్, రజక సంఘం నాయకుడు లక్ష్మీనారాయణ, నాయీ బ్రహ్మణ సంఘం నాయకులు నాగవెల్లి సురేష్, బట్టి శ్యాం యాదవ్, తాళ్ల సంపత్, మేర సంఘం నాయకుడు మంద వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళీ.. శరణం మమ

మహా శాకంబరిదేవిగా దర్శనం..

- ముగిసిన ఉత్సవాలు
- పులకించిన భక్తులు

హోమం మహాపూర్ణాహుతి



సీపీ దంపతులకు శేషవస్త్రాలు అందజేస్తున్న ఈఓ



హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో శాకంబరీ నవరాత్రోత్సవాల చివరిరోజు సోమవారం ఉదయం అమ్మవారిని మహాశాకంబరిదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని భద్రకాళి శరణం మమ అంటూ పులకించిపోయారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు పార్నంది నరసింహామూర్తి, చెప్పెల నాగరాజుశర్మ , టక్కరసు సత్యం, సోమసుందరశర్మ తదితరులు అలంకరణలో పాల్గొన్నారు. ఉదయం మిత్రాక్రమంలో, చిత్రాక్రమాలలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని మహాశాకంబరీదేవిగా అలంకరించి మహాహారతి, పంచహారతి, మహానివేదన జరిపారు. శాకంబరీ అలంకరణలో ఐదు టన్నుల 80 రకాల దుంపలు, కాయలు, ఆకుకూరలు, కూరగాయలు, 70 రకాల పండ్లను వినియోగించారు. మండువ శేషగిరిరావు, రేణుక దంపతులు, హైదరాబాద్‌కు చెందిన ఈమని హరికృష్ణ , స్మిత దంపతులు శాకంబరీ అలంకరణ దాతలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, సిబ్బంది నాగులు, చింతశ్యామ్ సుందర్, ఇతర సిబ్బంది ఏర్పాట్లను నిర్వహించారు. భద్రకాళి సేవాసమితి అధ్యక్షుడు అయితా గోపినాథ్, సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రముఖుల సందర్శన..

ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ రేవతి దంపతులు, మేయర్ గుండు సుధారాణి దంపతులు, హనుమకొండ జిల్లా న్యాయమూర్తి కృష్ణమూర్తి, నగర సీపీ రంగనాథ్ దంపతులు, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్– పద్మ దంపతులు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ..

- పలువురికి తీవ్రగాయాలు
- క్యాబిన్‌లో చిక్కుకున్న బస్సు డ్రైవర్
- కాపాడిన స్థానికులు
- లారీ డ్రైవర్ పరిస్థితి విషమం



బస్సు డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

దామెర: వేగంగా వచ్చిన ఓ లారీ.. ఆర్టీసీ బస్సును ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం ఉదయం హనుమకొండ జిల్లా దామెర మండలం ఒగ్లాపూర్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పరకాల డిపోకు చెందిన ఏపీ 36 జడ్ 0256 నంబర్‌గల ఆర్టీసీ బస్సు బెల్లంపల్లి నుంచి హనుమకొండకు వెళ్తోంది. హనుమకొండ నుంచి పరకాల వైపునకు వస్తున్న టీఎస్ 07 యూసీ 8979 నంబర్‌గల లారీ ఒగ్లాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై బస్సును ఎదురుగా ఢీకొంది. దీంతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా ముందుకు పడ్డారు. ఈ సమయంలో బస్సులో 57 మంది ప్రయాణికులు ఉండగా సుమారు ఏడుగురికి తీవ్రగాయాలు కాగా, మరో 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కావడంతో డ్రైవర్ భద్రయ్యలో క్యాబిన్‌లో ఇరుక్కున్నాడు. పోలీసులు, స్థానికులు సుమారు 20 నిమిషాల పాటు శ్రమించి అతడిని బయటకు తీశారు. అదే విధంగా లారీ డ్రైవర్, ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తోపాటు మరో ఐదుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలు కావడంతో 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. స్వల్పగాయాలైన వారిని దామెర క్రాస్‌లోని ఎస్‌ఎస్‌ఆర్ అపోలో రీచ్ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. కాగా, లారీ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో రహదారికి ఇరువైపులా కిలోమీటర్లమేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ఎస్సై రాజేందర్ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటనా స్థలికి పరకాల ఏసీపీ జూపల్లి శివరామయ్య, పరకాల రూరల్ సీఐ శ్రీనివాస రావు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బస్సు కండక్టర్ భాస్కర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

వివాహితపై లైంగిక దాడి

హసన్‌పర్తి: నగరంలోని భీమారానికి చెందిన ఓ వివాహితపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితురాలు సోమవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భీమారానికి చెందిన సంగాల ప్రవీత్, శరత్ లైంగిక దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేయూ పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఖిలా వరంగల్: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి.. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వరంగల్ దూపకుంట రోడ్డులోని గిరిప్రసాద్‌నగర్‌లో జరిగింది. స్థానికులు కథనం ప్రకారం వరంగల్ శంభునిపేట గిరిప్రసాద్‌నగర్‌కు చెందిన ఫహిమా, ఆయూబ్(57) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. పిల్లలందరి వివాహాలు అయ్యాయి. ఈ క్రమంలో ఆర్థికంగా ఇబ్బందులతో మనోవేదనకు గురైన ఆయూబ్ సోమవారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై సాంబయ్య ఘటనా స్థలిని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలను సేకరించారు. మృతుడి కుమారుడు అక్బర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య కేసులో మరో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌లో నర్మెట సీఐ నాగబాబుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రామకృష్ణయ్య హత్యకు సహకరించిన గోపాల్‌నగర్ చెందిన పస్తం ధర్మయ్య, పస్తం జగన్నాథంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసు విచారణను వేగవంతం చేస్తున్నామని, త్వరలోనే మరికొంత మందిని కూడా అరెస్ట్ చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రవణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని బంధం..

- గంట వ్యవధిలోనే అన్నదమ్ముల మృతి



కొమురయ్య గౌడ్ (ఫైల్)



సదానందం గౌడ్ (ఫైల్)

ఖిలా వరంగల్: ఒకే తల్లికి జన్మించిన అన్నదమ్ముల అనుబంధం చాలా గొప్పది. అన్న కాలుకి ముల్లుకు చ్చుకుంటే తమ్ముడు.. తమ్ముడి కంట్లో నలుసు పడితే అన్న విలవిలాడుతారు. కష్టసుఖాల్లో ఇరువురు పాలు పంచుకుంటూ అన్యోన్యంగా ఉంటారు. అలాంటి వీరి బంధాన్ని ఎవరూ విడదీయలేరు. చివరకు మరణం కూడా. దీనికి నిదర్శనమే ఈ ఘటన. వరంగల్ గణేశ్‌నగర్‌కు చెందిన ఉమ్మగాని కొమురయ్య గౌడ్ (80), వరంగల్ ఎల్బీనగర్ తిలక్ రోడ్డుకు చెందిన ఉమ్మగాని సదానందం గౌడ్ (65) అన్నదమ్ములు. వీరు గీత (గౌడ) వృత్తిని చేపట్టి కుటుంబాలను చక్కగా పోషించుకునే వారు. వారికి జన్మించిన పిల్లలను ఉన్నతంగా చదివించారు. కుమార్తెలు, కుమారుల వివాహం చేయగా వారు ప్రస్తుతం ఉన్నత స్థానంలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో వృద్ధాప్యంలో తాము సంతోషంగా ఉండాలని కోరుకునే సమయాన ఇటీవల అన్నదమ్ములు అనారోగ్యానికి గురయ్యారు. వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి కొమురయ్య మృతిచెందగా.. గంట వ్యవధిలోనే తమ్ముడు సదానందం తుది శ్వాస విడిచాడు. దీంతో మరణంలోనూ అన్నదమ్ముల బంధం వీడిపోలేదని పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే నరేందర్ సోమవారం కార్పొరేటర్ గుండేటి నరేందర్‌తో కలిసి మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

జాతర ఏర్పాట్లకు ముందస్తు కార్యాచరణ

- గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్

ఎస్‌ఎస్‌తాడ్వాయి : 2024 ఫిబ్రవరిలో జరుగనున్న మేడారం సమ్మక్క– సారలమ్మ మహాజాతర విజయవంతానికి ముందస్తు కార్యాచరణ చేపడుతున్నామని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. పొడు పట్టాల పంపిణీ అనంతరం మేడారంలోని ఐటీడీఏ గెస్ట్ హౌస్‌లో మహాజాతర ఏర్పాట్లు, నిధుల మంజూరుపై రూపొందించిన ప్రతిపాదనలను కలెక్టర్ కృష్ణ ఆదిత్య.. మంత్రి సత్యవతిరాథోడ్‌కు వివరించారు. రూ.75 కోట్లతో మహాజాతర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు ఇంటి పనిగా భావించి మేడారం మహాజాతరను విజయవంతం చేయాలన్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. సీఎం కేసీఆర్‌ను దీవించాలని వనదేవతలను వేడుకున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం మేడారంలో రూ. కోటి 25లక్షలతో నిర్మించిన రెవెన్యూ అతిథిగృహాన్ని జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, అధికారులతో కలిసి ప్రారంభించారు. అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, అధికారులు పాల్గొన్నారు.



రెవెన్యూ అతిథిగృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యవతి, జడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

పీఆర్‌సీ అమలు చేయాలి

- మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులకు కేయూ ఎన్జీఓ, నాల్గవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ వినతి

కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయంలో 2013లో నియామకమైన 80 మంది బోధనేతర, ఇతర ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు చేయాలని కేయూ ఎన్జీఓ, నాల్గవ తరగతి సంఘాల బాధ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో విద్యాశాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు వినతి పత్ర అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న బోధనేతర, విశ్రాంత ఉద్యోగులకు పీఆర్‌సీ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం 2021 ఆగస్టులో జీవో జారీ చేసిందన్నారు. దీనికి అనుగుణంగా ఉస్మానియా, కాకతీయ, తెలుగు, శాతవాహన, జేఎన్‌టీయూ మహాత్మా గాంధీ, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ, తెలంగాణ, పాలమూరు విశ్వవిద్యాలయాల్లో అమలవుతుందన్నారు. కాని కేయూలో మాత్రం 2013లో నియామకమైన 80 మంది ఉద్యోగులకు వర్తించడం లేదన్నారు. దీనిపై స్పందించి తమకూ వర్తింపజేయడంతోపాటు యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే, ఇవే సమస్యలపై శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేయూ ఎన్జీఓ, నాల్గవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లకావత్ యాదగిరి, వల్లాల తిరుపతి, మహమ్మద్ అబ్దుల్ శుకూర్, పి. కొమురయ్య, ఎతిరాజుల సతీశ్ బాబు, పి. అంకూశ్ పాల్గొన్నారు.



విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

వర్గీకరణకు చట్టబద్ధత ఎప్పుడు?

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్

కేయూ క్యాంపస్: జూలై 8వ తేదీన వరంగల్‌కు వస్తున్న ప్రధాని మోదీ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత ఎప్పుడో చెప్పాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కేయూ అతిథి గృహంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నరేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎస్సీ వర్గీకరణ విషయంలో చొరవ తీసుకుని ప్రధానితో ప్రకటన చేయించాలని కోరారు. కాగా, ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి ఈ నెల 7వ తేదీతో 29 సంవత్సరాలు అవుతుందన్నారు. ఈ సందర్భంగా 29వ ఆవిర్భావ మహాసభను వరంగల్‌లోని ఓ సిటీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి కరుణాకర్, కేయూ ఇన్‌చార్జి వడ్డేపల్లి మధుకర్, ఎంఎస్‌పీ జాతీయ నేత కడార్ల నవీన్ చారి, గోవిందు శాంతి కుమార్, ప్రేమ్ కుమార్, దూడపాక వెంకటేష్, జన్నే భాస్కర్, పెండ్యాల నిశాంత్, ప్రశాంత్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవిందు నరేశ్

ఆన్‌లైన్ చెల్లింపులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

- ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపులను ప్రోత్సహించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు సూచించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని సీజీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరివికాస్‌లో పెండింగ్ ఉన్న సర్వీసులను సకాలంలో మంజూరు చేయాలన్నారు. అలాగే, కాలిన, ఆగిన మీటర్లను మార్చాలన్నారు. సంవత్సరం పైబడిన వర్క్ ఆర్డర్స్ పూర్తయ్యేలా చూడాలన్నారు. సబ్‌స్టేషన్ల నిర్వహణ ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. దత్త గ్రామాల సమస్యలు పరిష్కరించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. అక్రమంగా వినియోగిస్తున్న సర్వీసులను గుర్తించి వాటికి మీటర్లు అమర్చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.మోహన్ రావు, సి.ప్రభాకర్, కె.కిషన్, కె.ఎస్.గుట్ట, రాజుచౌహాన్, భీకంసింగ్, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరీ కె. రమేష్, కంపెనీ కార్యదర్శి కె.వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడిన రహదారులు..

అతివేగం.. అజాగ్రత్త.. నిర్లక్ష్యం ఫలితంగా రహదారులు రక్తమోడాయి. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అటవీశాఖ అతిథి గృహం వద్ద ద్విచక్రవాహనాన్ని ఓ స్కూల్ బస్సు ఢీకొనదంతో బైక్‌పై ఉన్న ఓ యువకుడు, ఇదే జిల్లాలోని జమాండ్లపల్లి బ్రిడ్జి సమీపంలో కారుకు కుక్క అడ్డురావడంతో తప్పించబోయే క్రమంలో వాహనం పొలాల్లోకి దూసుకెళ్లగా వ్యక్తి, హనుమకొండ హంటర్ రోడ్డులో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటనలతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.

బైక్‌ను మరమ్మతు కోసం తీసుకువస్తుండగా బస్సు ఢీకొని యువకుడు మృతి..

మహబూబాబాద్ రూరల్: తన ద్విచక్రవాహనం పాడైపోగా.. మరమ్మతు చేయించేందుకు తీసుకువస్తున్న క్రమంలో స్కూల్ బస్సు ఢీకొని యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగింది. టౌన్ ఎస్సై గోపి కథనం ప్రకారం మహబూబాబాద్ మండలం లక్ష్మీపురం తండా జీపీ పరిధిలోని గమ్యతండాలో నివాసం ఉండే బానోత్ రాజు.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం రేలకాయలపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ అనిల్‌కుమార్ (19) బంధువులు. అనిల్ కుమార్ వారం క్రితం రాజు ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో తన ద్విచక్రవాహనం పాడవడంతో మరమ్మతు చేయించడానికి ఆటోకు తాడు కట్టి అదే వాహనంపై మహబూబాబాద్‌కు వస్తున్నారు. ఆటో, ద్విచక్రవాహనం జిల్లా కేంద్రంలోని అటవీశాఖ అతిథిగృహం వద్దకు చేరుకోగా వారి వెనుక నుంచి వచ్చిన విజ్‌డమ్ (తక్షశిల) పాఠశాల బస్సు అనిల్‌కుమార్ వాహనాన్ని ఢీకొంది. దీంతో యువకుడు బైక్‌పై నుంచి కిందపడగా.. బస్సు అతడి తలపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బావ బానోత్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.



అనిల్‌కుమార్ (ఫైల్)

కుక్కను తప్పించబోయి అదుపుతప్పిన కారు.. అపస్మారక స్థితికి వెళ్లి ఒకరు..

మహబూబాబాద్ రూరల్: కుక్కను తప్పించబోయిన కారు.. అదుపుతప్పి బోల్తాడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. రూరల్ ఎస్సై బి.రామ్‌చరణ్ కథనం ప్రకారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన తస్నీరు శ్రీనివాస్ (58).. భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలిసి కొంతకాలంగా వరంగల్‌లోని గిర్మాజీపేట విశ్వకర్మ వీధిలో నివాసం ఉంటున్నారు. వృత్తి రీత్యా జాతకాల రాళ్లు, రోల్డ్‌గోల్డ్ వ్యాపారం చేసే శ్రీనివాస్.. తన కుమారుడు చక్రధర్‌తో కలిసి కారులో మహబూబాబాద్‌కు వచ్చారు. అక్కడ నుంచి భద్రాచలం వెళ్తున్నారు. చక్రధర్ డ్రైవింగ్ చేస్తుండగా శ్రీనివాస్ పక్కనే కూర్చున్నారు. కారు.. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లి బ్రిడ్జి దాటగానే కుక్క అడ్డురావడంతో దానిని తప్పించబోయే క్రమంలో అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో శ్రీనివాస్ అపస్మారకస్థితికి చేరుకోగా చక్రధర్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా శ్రీనివాస్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. ఘటనా స్థలిని రూరల్ ఎస్సై రామ్‌చరణ్, ఏఎస్సై సూరయ్య, పీసీ గౌతమ్ పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



శ్రీనివాస్ (ఫైల్)

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్.. ఇద్దరి దుర్మరణం

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. వరంగల్ గాయత్రీనగర్‌కు చెందిన బొంతు అఖిల్ (23), ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన కొలెపాక శ్రీకాంత్(29).. బైక్‌పై వరంగల్ నుంచి హన్మకొండకు వస్తున్నారు. ఈ క్రమంలో హంటర్‌రోడ్డులోని పెట్రోల్‌పంపు వద్ద వేగంగా వస్తూ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో తీవ్ర గాయాలపాలైన ఇద్దరిని ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. దీనిపై బొంతు అఖిల్ బావ పెరుమాండ్ల అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు.



యువకుల మృతదేహాలు